# దొరికిన దొంగ

ఎం.హరికిషన్

ఒకూర్లో ఒకమ్మాయి వుండేది. ఆ అమ్మాయి చాలా తెలివైనది. అంతే గాదు పెద్ద అందగత్తె కూడా. ఆమె ది ఆమెది అట్లాంటిట్లాంటి అందం కాదు. ఏడేడు పద్నాలుగు లోకాల్లోనూ అంత అందగత్తె ఎక్కడా లేదని పేరు. పాలరాయి లాంటి తెల్లని ఒంటితో, ముత్యాల్లాంటి పళ్ళతో, చందమామలాంటి ముఖంతో మెరుపు తీగలెక్క మెరిసిపోతుంటాది. కానీ పాపం ఆ అమ్మాయి అనాథ. చిన్నప్పుడే అమ్మా నాన్నా చచ్చిపోయినారు. నా అని చెప్పుకోడానికి ఎవరూ లేరు. ఆయింట్లో ఈ యింట్లో పనిచేసుకుంటూ వాళ్ళు పెట్టినేది తిను కుంటా వుంటాది.

ఆ వూరి పక్కనే వున్న ఇంకో వూర్లో ఒక పెద్ద గజదొంగ వున్నాడు. వాడు అట్లాంటిట్లాంటి మామూలు దొంగ కాదు. మెడకు తెలీకుడా గొలుసును, చేతికి తెలీకుండా గాజును, నడుముకు తెలీకుండా వడ్డాణాన్ని కాజేసే రకం. రాత్రయితే చాలు ఎవరెవరు ఎక్కడెక్కడ ఏమేమి దాచి పెట్టినా కనుక్కోని చప్పుడుగాకుండా ఎత్తుకుపోయేటోడు. వాన్ని పట్టుకోడం చేతగాక ఆ వూరి రాజు ఎవరయితే ఆ దొంగను పట్టిస్తారో వాళ్ళకు లక్ష బంగారు వరహాలు ఇస్తానని దండోరా వేయించినాడు.

ఆ దొంగ రోజూ పొద్దున్నే చీరలమ్మేటోని వేషం వేసుకోని, సంచీనిండా చీరలు పెట్టుకోని రోజుకొక పల్లెకు పోయేటోడు. చీరల కోసం ఆడోళ్ళు ఇండ్లల్లోకి పిలుస్తారు గదా... అప్పుడు ఒకవైపు చీరలమ్ముతూనే మరో వైపు ఇంట్లో ఏమేమి ఎక్కడెక్కడ వున్నాయి, వాళ్ళు వున్నోళ్ళో లేనోళ్ళో అన్నీ గమనించేటోడు. ఒకరోజు అలా ఆపిల్ల వున్న వూరికి వచ్చినాడు. చీరల మ్ముతా అమ్ముతా ఆ ఇంట్లో పని చేస్తున్న పని చేస్తున్న ఆ పిల్లను చూసినాడు. ఆమెది కన్ను తిప్పుకోలేని అందం గదా... చూడగానే "అబ్బ... బంగారంలెక్క ఎంతందంగుందీ పిల్ల. చేసుకుంటే ఇట్లాంటి పిల్లనే చేసుకోవాల" అను కున్నాడు. నెమ్మదిగా అక్కడి ఆడోళ్ళతో ఆ మాటా ఈ మాటా మాట్లాడుతా ఆ పిల్ల వివరాలన్నీ కనుక్కున్నాడు.



తరువాత రోజు పొద్దున్నే శుభ్రంగా స్నానం చేసి, మంచిగా కొత్త బట్ట లేసుకోని, తలకు బాగా నూనె పట్టిచ్చి, చక్కగా దువ్వుకోని బుద్ధిమంతునిలెక్క వాళ్ళింటికాడికి వచ్చినాడు. ఆ పిల్ల కనబడగానే "పాపా... నన్ను గుర్తుపట్టినావా. నేను నీ మేనమామను. మీ అమ్మకు సొంత తమ్మున్ని. చిన్నప్పుడే మీ అమ్మ కొట్టిందనే కోపంతో ఇండ్లొదిలి దేశాలు పట్టుకోని పోయినాను. అక్కడ బాగా సంపాదిచ్చి ఈ మధ్యనే పక్కూరిలో మంచి మేడ కట్టుకొన్నాను. మా అమ్మా నాన్నల కోసం, అక్కా బావల కోసం వెదుకుతా వుంటే వాళ్ళంతా చచ్చిపోయినారని, నువ్వొక్కదానివే బతికున్నావని తెలిసింది. ఇంక నీకు ఏ బాధా వుండదు. నువ్వు హాయిగా కాలు మీద కాలేసుకోని బతకొచ్చు. నిన్ను పెండ్లి చేసుకోని పువ్వుల్లో పెట్టుకోని చూసుకుంటాను. దా పోదాం" అంటూ వాళ్ళమ్మా నాన్నల వివరాలన్నీ చెబుతూ బాగా నమ్మబలికినాడు. దాంతో ఆ పాప ఆ దొంగోని మాటలు నిజమని నమ్మి సంబరంగా వానెంట వెళ్ళింది. కానీ... ఆ పాప సంతోషం కొన్ని రోజులుగూడా మిగలలేదు. ఆ దొంగోడు రాత్రుళ్ళు అందరూ పండుకున్నాక బయటకి పోవడం, జనాలింకా నిదుర లేవకముందే పెద్ద పెద్ద మూటల్తో రావడం గమనించింది. ఒకరోజు వాడు బైటికి పోగానే తలుపులన్నీ మూసి పెట్టెలన్నీ తెరిచి చూసింది. దాంట్లో అడుగున ఎవరికీ కనబడకుండా దాచిన బంగారం, వజ్రాలు కుప్పలు కుప్పలు కనబన్నాయి. దాంతో ఆ పాపకు అనుమానమొచ్చి అలాగే మేలుకోని వాడు దొంగతనం చేసుకోని రాగానే "చెప్పు ఎవరు నువ్వు... ఈ రాత్రిపూట ఏం తీసుకొస్తున్నావు. నీకింత బంగారమెక్కడిది" అంటూ నిలదీసింది.

ఆ దొంగోడు ఆపాప జుట్టు పట్టుకోని "అవునే... నేను దొంగనే. నిన్ను పెండ్లి చేసుకోడానికి మాయమాటలు చెప్పి ఎత్తుకొచ్చాను. అంతేగానీ నువ్వు నా కోడలివీకాదూ, నేను నీ మామనూ కాదు" అంటూ ఆ పాపను ఒక చిన్న గదిలో వేసి బైట తాళం వేసినాడు. ఆ రోజు నుండి రోజు బైటకు పోయేటప్పుడు ఆమెను ఆ గదిలో పెట్టి పోయేటోడు. రాగానే ఇంటి తలుపులు లోపల గడియపెట్టి గది తలుపులు తెరిచేటోడు. ఇంటి పనులన్నీ ఆ పాపతోనే చేయించేటోడు. రోజూ కసువులు వూడ్చి, బండలు తుడ్చి, అన్నం చేసి, అంట్లు కడిగి ఆ పాప బాగా అలసిపోయేది.

ఆ దొంగోని నుంచి ఎలా తప్పించుకోవాలా అని ఆలోచిస్తా వుంటే ఆ పాపకు ఒకరోజు వంటింట్లో ఒక చిన్న కిటికీ కనిపించింది. తలుపులు తెరుద్దామని చూస్తే తెరుచుకోలేదు. కిటికీ పక్కనే ఒక చిన్న మీట కనబడింది. దాన్ని నొక్కగానే సరిగ్గా ఒక మనిషి పట్టేంతగా కిటికీ తెరుచుకుంది. భటులు ఎవరయినా తన సంగతి తెలుసుకోని పట్టుకోడానికి ఇంటి మీదికి వస్తే, వారికి చిక్కకుండా పారిపోడానికి ఆ దొంగ ఆ ఏర్పాటు చేసుకున్నాడు. దాన్ని చూసినాక ఆ పాపకు ఒక ఉపాయం తట్టింది.

తరువాత రోజు వంటగదిలో కట్టెలపై కొంచెం నీళ్ళుచల్లి వంట చేయసాగింది. దాంతో ఇల్లంతా కమ్ముకోనింది. వాడు ఖల్ ఖల్‌మని దగ్గుతూ "ఏందే... ఇంత పొగ బెట్టినావు" అని అరిచినాడు. "కట్టెలు పచ్చిగా వున్నాయి. అందుకే పొగ వస్తావుంది. వంట అయిపోయేంతవరకూ తలుపులు మూసి బైట కూచో" అని చెప్పింది. వాడు 'సరే' అని తలుపులు మూసి బైట కూర్చున్నాడు. వెంటనే ఆమె నీళ్ళ సీసా మూతకి చిన్న బొక్క పెట్టి, దాన్ని పైన యాలాడదీసి, దానికింద పొయ్యి పెట్టి, పైన పెనం పెట్టి మంట పెట్టింది. ఇసుర్రాయికి తాడు కట్టి దానిని ఫ్యానుకు కట్టి మీట నొక్కింది. పెరట్లోని బరెగొడ్డును చప్పుడు గాకుండా లోపలకు తోలుకోనొచ్చి దాని తోకకు పొరకను కట్టింది. నెమ్మదిగా వంటగది మూలనున్న కిటికీ తెరచుకోని అవతలికి దుంకి పారిపోయింది. అలా పోయి ఆ వూరి రాజును కలిసి జరిగిందంతా చెప్పింది. రాజు వెంటనే ఆ దొంగోన్ని పట్టుకోడానికి ఆమె వెంట సైనికులని పంపిచ్చినాడు.

దొంగోనికి ఇదంతా తెలీదుగదా... దాంతో బైట కూచోని వున్నాడు. కొంచంసేపటికి ఫ్యాను గిరగిర తిరుగుతా వుంటే దానికి కట్టిన ఇసుర్రాయి సుర సుర సురమని తిరగడం మొదలుపెట్టింది. ఆ చప్పుడు విని వాడు "ఓహో... లోపల ఈ పిల్ల ఏదో పిండి విసురుతున్నట్టుందే" అనుకున్నాడు. కాసేపటికి పైన యాలాడదీసిన సీసాలోంచి నీళ్ళు కారి వేడెక్కిన పెన్నం పైపడ్డంతో సుయ్... సుయ్... మని సప్పుడు రాసాగింది. ఆ చప్పుడు విని వాడు "ఓహో... లోపల ఈ పిల్ల ఓ పక్క పిండి విసుర్తా నే మరోపక్క దోసెలు వేస్తా వున్నట్టుంది" అనుకొన్నాడు. అంతలో లోపల బరెగొడ్డు అలా ఇలా కదలసాగింది. దాంతో దాని తోకకు కట్టిన చీపురు అలాఇలా కదులుతూ సరసర చప్పుడు చేయసాగింది. ఆ చప్పుడు విని వాడు "ఓహో.. లోపల ఈ పిల్ల కసువు కొడ్తున్నట్టుందే" అనుకున్నాడు. అలా ఓ గంట దాటిపోయింది. కానీ చప్పుడు మాత్రం ఆగలేదు. "ఇదేందబ్బా ఇంతసేపైనా చప్పుళ్ళు ఆగడం లేదు. ఐనా ఒకేసారి కసువు కొడ్తున్న చప్పుడు, దోసెలు పోస్తున్న చప్పుడు, పిండి విసురుతున్న చప్పుడు వస్తా వుంది. ఒక మనిషి ఒకేసారి ఇన్ని పనులు ఎలా చేయగలదు" అని అనుమానమొచ్చి గబగబా తలుపులు తెరిచి లోపలికి పోయినాడు. చూస్తే... ఇంగేముంది... పైన యాలాడదీసిన సీసా, ఫ్యానుకు కట్టిన విసుర్రాయి, బరెగొడ్డు తోకకు కట్టిన పొరకా కనబడ్నాయి. "అరే... ఇది నన్నే మోసం చేసి తప్పించుకుపోయిందే... దీని అంతు చూడాలి" అని పండ్లు పట పట కొరుక్కుంటూ కోపంతో కత్తి తీసుకోని వెనక్కు తిరిగినాడు. కానీ... అంతలోనే ఆమె రాజభటులతో అక్కడికి వచ్చేసింది. దొంగోడు దొరికిపోయినాడు. రాజు ఆమె తెలివితేటలని, ధైర్యాన్ని, అందాన్ని బాగా మెచ్చుకోని "నీకు లక్ష బంగారు వరహాలేం సరిపోతాయి. నా కొడుకునే ఇస్తా చేసుకో" అంటూ తన ఒక్కగానొక్క కొడుకు నిచ్చి అంగరంగ వైభవంగా పెండ్లి చేసి కోడలిగా చేసుకున్నాడు.